# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 04-06-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ఇంధన భద్రతను పెంపొందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఓఎన్‌జీసీ కి పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

**2.** **తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.**

**3.** **తెలుగు ప్రజల ఆత్మగౌరవం, ఆంధ్రరాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.**

**4.** **ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.**

==========================

ఇంధన భద్రతను పెంపొందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ –ఓఎన్‌జీసీ చైర్మన్ అరుణ్ కుమార్ సింగ్ అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రిని నిన్న మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో ఓఎన్‌జీసీ చేపడుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం, ఓఎన్‌జీసీ మధ్య సమన్వయంతో ప్రాజెక్టులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. చమురు, సహజవాయువుల అన్వేషణ జరిగే ప్రాంతాల అభివృద్ధికి కార్పొరేట్ సామాజిక బాధ్యత –సీఎస్‌ఆర్ నిధులను వినియోగించాలని కోరారు.

--------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈరోజు, రేపు రెండు రోజులపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటిస్తారు. ఈరోజు పాలమూరు ప్రాంతంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించి, వాటి పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. మధ్యాహ్నం నారాయణపేట జిల్లా మక్తల్‌కు చేరుకుని మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం, భీమా, కృష్ణా నదులపై ప్రతిపాదిత బ్యారేజీల పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకోనున్నారు. సాయంత్రం సోమశిలకు చేరుకుని, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారని అధికారులు తెలిపారు. రేపు కూడా పలు నీటి ప్రాజెక్టను ముఖ్యమంత్రి పరిశీలించనున్నారు.

--------------------------

తెలుగు ప్రజల ఆత్మగౌరవం, ఆంధ్రరాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. అమరావతిలోని శాఖమూరులో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు స్మృతి వనాన్ని ఆయన నిన్న సందర్శించి నివాళులర్పించారు. అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, ఆంధ్ర రాష్ట్రానికి అసలైన గుర్తింపును, ఉనికిని పొట్టి శ్రీరాములు కల్పించారని చెప్పారు. ఆయన ప్రాణత్యాగం వల్లే స్వతంత్ర భారతదేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు జరిగిందని ఉపముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..30..సెకన్లు

---------------------------

కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి రాందాస్ అథవాలే అధ్యక్షతన జాతీయ సామాజిక న్యాయ మండలి సమావేశాన్ని ఢిల్లీ నుంచి దృశ్య మాధ్యమం విధానంలో నిన్న నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద అందిస్తున్న నిధులను అదనంగా 50 లక్షల రూపాయలు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రాష్ట్రానికి కొత్తగా 58 సంక్షేమ వసతి గృహాలను మంజూరు చేయాలని, నిర్మాణాల కోసం ప్రస్తుతం ఇస్తున్న 3 లక్షల రూపాయల నిధిని 5 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

---------------------------

తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. రాష్ట్రంలోని ఆర్మూర్-జగిత్యాల- జాతీయ రహదారి ఎన్‌హెచ్-63 విస్తరణకు ఆమోదం లభించగా, హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో ఈ పనులు చేపట్టనునట్లు వెల్లడించారు. అదే విధంగా జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారి ఎన్‌హెచ్-563 విస్తరణకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపిందని, మొత్తం 7 వేల 597 కోట్ల రూపాయల వ్యయంతో 190 కిలోమీటర్ల మేర ఈ రెండు జాతీయ రహదారులను నాలుగు వరుసలుగా విస్తరించనున్నామని చెప్పారు. ఈ నిర్ణయంతో ప్రాంతీయ అభివృద్ధికి మరింత ప్రయోజనం చేకూరనుందని పేర్కొన్నారు.

---------------------------

వర్షాకాలానికి ముందే నీటి కాలుష్య నివారణ చర్యలను వేగవంతం చేయాలని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. విజయవాడలో నిర్వహించిన మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ల రాష్ట్ర స్థాయి కార్యశాలలో ఆయన నిన్న మాట్లాడుతూ, పురపాలక సంఘాల్లో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని సూచించారు. స్వచ్ఛ భారత్, గ్రీన్ కార్పొరేషన్ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ, వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

రష్యా పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మాస్కోలోని అధునాతన రవాణా అభివృద్ధి కేంద్రాన్ని నిన్న సందర్శించారు. ఇందులో భాగంగా కేంద్రంలోని సమాచార సాంకేతిక వ్యవస్థ కార్యకలాపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధికారి పావెల్ బోక్షా పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ద్వారా మాస్కో రవాణా కేంద్ర అభివృద్ధిని వివరించారు. అనంతరం మాస్కో ట్రాఫిక్ నిర్వహణ కేంద్రం పనితీరు, రవాణా నిర్వహణ వ్యవస్థల గురించి అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆధునిక సాంకేతికత ఆధారిత ప్రజా సేవల అభివృద్ధికి ఇటువంటి నమూనాలు దోహదపడతాయని తెలిపారు.

---------------------------

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడులోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 101 మంది లబ్ధిదారులకు 61 లక్షల 72 వేల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన నిన్న పంపిణీ చేశారు. పేద కుటుంబాలు వైద్య ఖర్చులను అధిగమించి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగపడుతోందని మంత్రి ఈసందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ అభ్యర్థులకు అండగా నిలుస్తామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో పలువురు డీఎస్సీ అభ్యర్థులు ఆయనతో నిన్న సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, డీఎస్సీ నియామకాల విషయంలో అన్యాయం జరిగిందని భావిస్తున్న అభ్యర్థులకు వైఎస్సార్‌సీపీ లీగల్ విభాగం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఎండల తీవ్రత కొనసాగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ రోజు, రేపు రాష్ట్రంలోని పలు మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43 నుంచి 45 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశముందని పేర్కొంది. అలాగే ద్రోణి ప్రభావంతో కోస్తా జిల్లాలలోని కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

ద్రోణి ప్రభావంతో తెలంగాణలో ఈ రోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు నిజామాబాద్, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట జిల్లాలకు ఈరోజు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

======================